# వైద్య వృత్తిధర్మం



*యావత్కంఠగతాః ప్రాణాః*
*యావన్నశ్యతి చేంద్రియం*
*తావచ్చికిత్సా కర్తవ్యా*
*కాలస్య కుటిలాగతిః*

***భావం:*** ఒక వ్యక్తికి కంఠంలో ప్రాణమున్నంతవరకూ, ఇంద్రియాలు నశించనంతవరకూ చికిత్స చెయ్యడం (వైద్యుని) కర్తవ్యం. కాలగతి ఒకే రీతిగా (తిన్నగా) ఉండదు.

అర్ధరాత్రి 'అయ్యగారూ కాపాడండి' అని అరుపు విని రామశర్మ నిద్ర లేచాడు. అయనతోపాటు భార్య కూడా నిద్ర లేచింది. చలికాలం వల్ల

గదిలో వేడికోసం కుంపటి ఉంది.రామశర్మ భార్య కుంపటి ఊది మంట రేగించి ఈనపుల్లతో అముదపు దీపం వెలిగించింది. రామశర్మ ఆ చుట్టుపక్కల మొత్తానికి హస్తవాసి కలవాడని పేరు పొందిన వైద్యుడు.అర్థరాత్రి రోగులు ఆయనకోసం రావడం సామాన్యమే. దీపం చేత్తో పట్టుకుని రామశర్మ ఇంటి బయటకు వచ్చాడు. అప్పటికే అరుగుమీద నిద్రిస్తున్న ఆయన శిష్యులు కూడా నిద్ర లేచి నిలబడి ఉన్నారు.

గుమ్మంలో రైతు వీరేశం భార్య ఏడుస్తూ వైద్యుడి కాళ్ళు పట్టుకుంది. "ఏమైందమ్మా" అని రామశర్మ అడిగాడు. "ఇద్దరం పొలం కాపలాకి వెళ్ళాము. నేను మంచె ఎక్కి నిల్చున్నాను. నా పెనిమిటి నాలుగుదిక్కులూ తిరుగుతూ, మధ్యమధ్యలో మంచంమీద కూచునేవాడు. దూరంగా అలికిడయింది. ఏ తోడేలైనా వచ్చిందే మోనని ఒక చేత్తో దీపమూ, ఒక చేత్తో కర్ర పట్టుకెళ్లాడు. అంతే అయ్యగారూ, గట్టు దగ్గర పడిపోయాడు, నోట్లో నురగ వస్తోంది. మీ దగ్గరకు పరిగెత్తుకొచ్చాను.

రామశర్మ వెంటనే బయల్దేరాడు. ఆయన వెంట శిష్యులు దీపాలూ, మందుల సంచీ తీసుకుని బయల్దేరారు. పొలం గట్టు మీదకు వీరేశాన్ని చేర్చి రామశర్మ నాడి చూశాడు. నాడి బలహీనంగా ఉంది. నరంలోకి సూది గుచ్చి రక్తాన్ని పరీక్షించాడు. పాము విషం ఎక్కలేదు. తేలు కానీ, జెర్రి కానీ కుట్టినట్లు లేదు. ఏదో ఒక పురుగు కుట్టిన గాయం మాత్రం కన్పిస్తోంది. శిష్యులను వీరేశాన్ని ఇంటికి తీసుకురమ్మన్నాడు. శిష్యులు వీరేశాన్ని అతని గుడిసెకు చేర్చారు. రామశర్మ తత్కాలశాంతికి కొన్ని లేపనాలు రాశాడు.

మర్నాడు రామశర్మ వీరేశాన్ని చూడడానికి వెళ్ళి సంపూర్ణంగా పరీక్షించాడు. గుండె బలహీనంగా కొట్టుకుంటోంది. చూపు గాజు కళ్ళ చూపులా ఉంది. మాట వినిపించడం లేదు. తేనె నాకిస్తే లోపలకు వెళ్ళింది. ఇంద్రియాలు కొంతవరకూ పనిచేస్తున్నాయన్న మాట. ఔషధాలతో కూడిన తైలంతో మర్దన చేశాడు. తేనెతో మందు నాకించాడు. వీరేశంలో ఏ మార్పూ కన్పించలేదు.

రోజులు గడుస్తున్నాయి. రామశర్మ ప్రతి దినమూ వీరేశం ఇంటికి వెళ్ళి తైలం మర్ధన చేసి, ఔషధాలను తేనెతో నాకించి వచ్చేవాడు. ఈ చికిత్సకు సుమారు రెండు గంటలు పట్టేది. ఆ సమయంలో ఇంటికి వచ్చిన రోగులకు శిష్యులే వైద్యం చేసేవారు. క్రమంగా వారందరికీ పేరుప్రఖ్యాతులూ, ధనమూ లభించసాగాయి.

ఒకనాడు రామశర్మను భార్య "వీరేశానికి కొంచెమైనా నయమైందా" అని అడిగింది. రామశర్మ మాట్లాడలేదు. "తగ్గుతుందో లేదో తెలియని రోగి చికిత్సకై సర్వవిధాలా శ్రమిస్తున్నారు. ఆ సమయంలో ఇంకెందరికో వైద్యం చెయ్యవచ్చును కదా. హస్తవాసి మంచిదన్న పేరూ నిలబడుతుంది." అంది.

రామశర్మ"సులభంగా నయమయ్యే రోగాలకు నా శిష్యులైనా చికిత్స చెయ్యగలరు. రోగికి తగ్గుతుందా లేదా అని ఆలోచించకుండా ఎంత క్లిష్టమైన రోగానికైనా చికిత్స చెయ్యడం వైద్యుని ధర్మం. రోగం తగ్గదనీ రోగి మరణిస్తాడనీ నిర్ణయించడానికి మనం సర్వేశ్వరులమా? కంఠంలో ప్రాణమున్నంతవరకూ, ఇంద్రియాలు నశించనంతవరకూ చికిత్స చెయ్యడం వైద్యుడి కర్తవ్యం. కాలం ఒకే రీతిలో తిన్నగా నడవదు" అన్నాడు.

తప్పక నయమయ్యే కేసులనే స్వీకరించే డాక్టర్లకీ క్లిష్టమైన కేసులని అడ్మిట్ చేసుకోని ఆస్పత్రులకీ ఈ సనాతన ధర్మంతెలియదనుకోవాలా?

******